కష్టమొస్తే నేనున్నాను

- సేవా మార్గంలో ఫేస్‌బుక్ గ్రూపు
- ఆపదలో ఉన్న వారికి సేవలు
- రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- సొంత సొమ్ముతో సేవలందిస్తున్న మేడిద సుబ్బయ్య ట్రస్ట్



సీతానగరం మండలం మిర్తిపాడులో పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మేడిద సుబ్బయ్య ట్రస్ట్ నేనున్నాను ఫేస్‌బుక్ గ్రూపు సభ్యులు

కంబాలచెరువు: ఫేస్ బుక్ అనగానే మన ఫొటోలు, వీడియోలను పోస్టింగ్‌లు చేసుకుంటూ, ఒకరి విషయాలను మరొకరు షేర్ చేసుకుంటూ గడిపే సోషల్ మీడియా యాప్. అందులో రకరకాల అభిప్రాయాలు, మనోభావాలను అవతలివారితో పంచుకుంటూ ఉంటారు. అయితే ఇలా వీరందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి కొందరు ఫేస్ బుక్ గ్రూపులను ఏర్పాటు చేశారు. కొందరు వీటి ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సభ్యులందరూ కొంత మొత్తం డబ్బులు వేసుకుని ఆపదలో ఉన్నవారికి అందజేస్తున్నారు. అయితే మేడిద సుబ్బయ్య ట్రస్ట్ నిర్వహిస్తున్న 'నేనున్నాను' ఫేస్ బుక్ చారిటీ గ్రూపు విధానమే వేరు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా సొంత ఖర్చుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

వేల సంఖ్యలో సభ్యులు

2022లో అతి కొద్దిమందితో ప్రారంభమైన మేడిద సుబ్బయ్య ట్రస్ట్ 'నేనున్నాను' ఫేస్ బుక్ గ్రూపులో నేడు వేల సంఖ్యలో సభ్యులున్నారు. వారందరినీ సేవా కార్యక్రమాల వైపు నడపడమే ఈ గ్రూపు ప్రత్యేకత. ఎవ్వరూ రూపాయి తీసే పని లేకుండా ఆయా ప్రాంతాల్లోని గ్రూప్ సభ్యులకు దిశానిర్దేశం చేస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సీతానగరం మండలం మిర్తిపాడులో నిరుపేద కుటుంబాలకు మేడిద సుబ్బయ్య ట్రస్ట్ నిత్యావసరాలు పంపిణీ చేసింది. రాజమహేంద్రవరం దానవాయిపేటలోని గ్రేస్ హోమ్‌లో చిన్నారులకు ఆహారం అందజేసింది. ఇప్పటి వరకు సుమారు 120 పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ముందుకు దూసుకుపోతోంది.

సొంత ఖర్చుతో..

మేడిద సుబ్బయ్య ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గ్రూప్ అడ్మిన్ మేడిద వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ వరించింది. జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, వేసవిలో చలివేంద్రాలు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, పేద పిల్లలకు చదువుకునేందుకు ఫీజులు కట్టడం, కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ, ఆశ్రమాల్లో చిన్నారులు, వృద్ధులకు భోజనాలు పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలను మేడిది సుబ్బయ్య ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఆపదలో ఉన్న వారికి వేల రూపాయలు సహాయం అందిస్తూ బాధితులకు ఆపన్న హస్తం అందిస్తోంది.

సేవే లక్ష్యం



నేనున్నాను ఫేస్‌బుక్ గ్రూపు ద్వారా సేవే లక్ష్యంగా ముందుకెళుతున్నాం. ఆపదలో ఎవరైనా అంటే వెంటనే అక్కడికి వెళ్లి వారికి సహాయం చేయడమే లక్ష్యం. గ్రూపులోని సభ్యులందరూ కార్యక్రమాలు నిర్వహించడానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. వారిని చూసి చాలామంది స్ఫూర్తిపొందుతున్నారు. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. దీనికి గ్రూప్ సభ్యులందరూ సహకరించాలి. – **మేడిద వెంకటేశ్వరరావు, అడ్మిన్, నేనున్నాను ఫేస్‌బుక్ గ్రూపు**

నిత్యావసరాల పంపిణీ



చాలా పేద కుటుంబాలు తినేందుకు తిండిలేక అలమటిస్తున్నాయి. అటువంటి వారికి నేనున్నాను గ్రూపు ద్వారా భరోసా కల్పిస్తున్నాం. పట్టణ శివారు ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో తిండికి ఇబ్బందులు పడుతున్న వారిని చాలా మందిని గుర్తించాం. వారందరికీ త్వరలోనే తమ ట్రస్ట్ ద్వారా సహాయాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నాం. దీనికి మమల్ని ప్రోత్సహిస్తున్న మేడిద సుబ్బయ్య ట్రస్ట్‌కు ప్రత్యేక అభినందనలు. **– ప్రభ ప్రసాద్, మోడరేటర్**

మా అదృష్టం



ఆపదలో ఉన్న వారికి సేవ చేసే అవకాశం నేనున్నాను ఫేస్‌బుక్ గ్రూపు ద్వారా కలగడం మా అదృష్టం. కష్టాల్లో ఉన్నవారికి, పేదలకు సేవ చేయాలనే నా కోరిక ఈ రూపంలో తీరుతోంది. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సేవలు అందేలా గ్రూప్ అడ్మిన్లు, మోటరేటర్లు, ఇతర సభ్యులందరి ద్వారా చూస్తున్నాం. మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే దిశగా ముందుకు వెళుతున్నాం. పేదలందరికీ భరోసా కల్పిస్తున్నాం. **– ఎం.సుజాత, మెంబర్**

గర్వంగా ఉంది



పది మందికి సహాయం చేసే అవకాశం వచ్చినందుకు గర్వంగా ఉంది. ఈ అవకాశాన్ని కల్పించిన మేడిద సుబ్బయ్య ట్రస్ట్ నిర్వాహకులకు రుణపడి ఉంటాను. వారి ప్రోత్సాహంతో రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నిత్యావసరాలు పంపిణీ చేశాం. మారుమూల ప్రాంతాలకూ వెళ్లి వితరణ కార్యక్రమాలు చేపడుతున్నాం. **– వండస్ కుమార్, మెంబర్**

క్లుప్తంగా

విద్యా సమస్యలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కంబాలచెరువు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28, 29, 30 వ తేదీల్లో మండల కేంద్రాల వద్ద ధర్నాలు, నవంబర్ 6న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నారు.వీటికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించి, మెస్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ముద్దాల అను, పోసికుమార్

ధవళేశ్వరం: గ్రామంలోని భవిత కేంద్రం విద్యార్థులకు గురువారం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ పుస్తకాలను పంపిణీ చేశారు. పంతం కొండలరావు జన్మదినం సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పుస్తకాలు అందజేశారు.

తైక్వాండోలో బంగారు పతకం

ప్రకాశం నగర్: కాకినాడలోని ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళ కళాశాలలో ఇటీవలే జరిగిన అంతర్ కళాశాల మహిళా టోర్నమెంట్‌లో తైక్వాండో 72 కేజీల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాలకు చెందిన ఎల్. వైష్ణవి బంగారం పతకం సాధించింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఎబల్ రాజబాబు గురువారం ప్రకటన విడుదల చేశారు. అమృతసర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 9వ తేదీన జరిగే 72 కేజీల మహిళా విభాగం పోటీల్లో వైష్ణవి పాల్గొంటుందన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కంబాలచెరువు: విద్యార్థులకు చదవడం రాయడం వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీవైఈవో బీఎల్ నారాయణ చెప్పారు. స్థానిక ప్రభుత్వ నేషనల్ సీనియర్ బేసిక్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పూర్తయిన సిలబస్‌ను పరిశీలించారు. తరగతిలో విద్యార్థుల స్థాయిని పరీక్షించి, తరగతి అభ్యసనాలపై సూచనలు చేశారు. విద్యార్థులందరూ పాఠాలు బాగా చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అపార్ ఐడీకి సంబంధించి తల్లిదండ్రుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. యూడైస్‌లో విద్యార్థుల వివరాలు ఆధార్‌తో సరిపోవాలని, లేకపోతే అపార్ ఐడీ రాదని హెచ్ఎం రాధామణికి తెలిపారు. అన్నామృత ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు అందుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని పరిశీలించారు.

27న ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటక శాఖ సౌజన్యంతో గోదావరిపై తొలిసారిగా ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఈ నెల 27న ప్రారంభం కానుంది. సిల్వర్ స్పూన్ రెస్టారెంట్ అండ్ ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్వహణలో తొలిసారిగా గోదావరి ఇసుక తిన్నెల్లో రెస్టారెంట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభోత్సవం చేస్తారు. ఉమామార్కండేయస్వామి ఆలయం సమీపంలోని లాంచీల రేవు నుంచి ఏపీ టూరిజం బోటులలో ప్రయాణించి, ఇసుక తిన్నెల దగ్గర గల ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్దకు చేరుకోవాలి.



ఫ్లోటింగ్ రెస్టారెంట్

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ నరసింహ కిశోర్
- కడియం పోలీస్ స్టేషన్ తనిఖీ



కడియంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కడియం: జిల్లాలో నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కడియం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల ప్రగతిని ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. నమోదైన ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సంబంధిత కేసు ప్రగతిని ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి కార్యాచరణ చేపడుతున్నామన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా పరమైన మార్పులు, చేర్పులను చేస్తామన్నారు. అలాగే యూత్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజలతో మమేకమై, శాంతిభద్రతల పరిరక్షణకు ఇది దోహదపడుతుందన్నారు. ఉమెన్ రక్షక్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. నేరాల అదుపు, దర్యాప్తులో సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించి, విస్తృతంగా వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో సెక్షన్ 174 కింద నమోదైన కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా మహిళలు ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి, వాటిని నివారించేందుకు ఏం చేయాలన్నదానిపై చర్చించి, మహిళా సిబ్బంది సహకారంతో తగిన కార్యాచరణను అమలు చేస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నర్సరీల్లో పనులు చేసుకునేందుకు వచ్చే మహిళలకు అవగాహన కార్యక్రమాలు అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. స్టేషన్ పరిధిలో పలు చోరీలకు సంబంధించి రికవరీని సాధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అంతకు ముందు వేమగిరి జంక్షన్ పోలీస్ అవుట్ పోస్టును పునఃప్రారంభించారు. ఆయన వెంట దక్షిణ మండలం డీఎస్పీ భవ్య కిశోర్, కడియం ఎస్సైలు దుర్గాప్రసాద్, ధనలక్ష్మి ప్రసన్న ఉన్నారు.

ఆహార అలవాట్లతోనే క్యాన్సర్ ముప్పు

కంబాలచెరువు: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలితోనే దేశంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని చంద్రకళ సూపర్ స్పెషాలిటీ సర్జికల్ క్యాన్సర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పట్నాల విశ్వనాథ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎల్ పురం చైతన్య జూనియర్ కళాశాలలో గురువారం చైల్డ్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పట్నాల విశ్వనాథ్ మాట్లాడుతూ చిన్న పిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం వల్ల రేడియేషన్ కారణంగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఏడు రకాల క్యాన్సర్లను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను చిన్న వయసులో ఇవ్వడం ద్వారా క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన లయన్ మద్దుల వీఎస్ శ్రీరామగుప్తా మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా ప్రతి నెలా కళాశాల లేదా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చైతన్య కళాశాల ఏజీఎం కె.గోవిందరాజు, చైతన్య ప్రిన్సిపాల్ లక్ష్మణ్, క్లబ్ అడ్మిన్, గ్రంధి వసంత కుమారి, కార్యదర్శి వెన్న కుమారస్వామి, ట్రెజరర్ ఉలగంటి రాఘవరావు, క్లబ్ మాజీ అధ్యక్షుడు మాధవరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీఎల్ఎస్ శిక్షణ అవసరం



డాక్టర్ చంద్రమౌళిని సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరికీ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ అవసరమని రాజమండ్రి అడ్వాన్స్ క్రిటికల్ కేర్ (ఆర్ఏసీసీ) హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ తాటికొండ చంద్రమౌళి అన్నారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం హుకుంపేట గోదావరి రుచుల కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. దీనికి రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలను కాపాడటంలో బీఎల్ఎస్ ప్రధానమైందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రతి పీఎంపీ సంఘ పరిధిలోనే సేవలందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సహాయ కార్యదర్శి కె.జనార్దన్, రాష్ట్ర మీడియా కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ చంద్రమౌళిని, ఇటీవల జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వీబీటీ రాజు, జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తోరాటి ప్రభాకరరావు, జాతీయ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కె.జనార్దన్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



డీవైఎఫ్ఐ జిల్లా సమావేశం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంబాలచెరువు: కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 35 వేల పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వి.రాంబాబు, డి.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఇన్నీసుపేటలోని బాలోత్సవ భవన్‌లో ఈ నెల 26న జరగనున్న డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం డీవైఎఫ్ఐ నాయకులు పోస్టర్ విడుదల చేశారు. వి.రాంబాబు, డి.అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము హాజరవుతారన్నారు. భగత్ సింగ్, మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో 1980 నవంబర్‌లో పంజాబ్‌లోని లూధియానాలో డీవైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల గారడీ చేస్తోందని, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

హేతుబద్ధీకరణలో ఏఈవోలను మినహాయించాలి



వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేణుమాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: హేతుబద్ధీకరణ పేరుతో ఏఈవో స్థాయిని తగ్గించడానికి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం (ఏఈవో) రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు అన్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ డైరెక్టర్‌కు రాసిన వినతిపత్రాన్ని గురువారం రాజమహేంద్రవరం వచ్చిన వ్యవసాయశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ వి.శ్రీధర్‌కు అందజేశారు. హేతుబద్ధీకరణ పేరుతో రికార్డు అసిస్టెంట్ స్థాయిగల గ్రామ వ్యవసాయ సహాయకులకు, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌స్థాయిగల వ్యవసాయ విస్తరణాధికారులకు సమాన పని చేసేలా ఉన్నతాధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో మిగులు ఎంపీఈవోలను తీసుకోకుండా మిగులు ఏఈవోలను లెక్కించడం అన్యాయమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఏఈవో సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీటర్, శివ, పివీ శ్రీను, గౌరీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఈ మేరకు సమీక్ష నిర్వహించారు. నగరంలోని రోడ్లపై గుంతలు పూడ్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని, పూర్తి స్థాయిలో పరిశీలించి అంచనాలు తయారు చేయాలన్నారు. వర్షాకాలం పూర్తయినందున బీటీ రోడ్ల పనులకు అంచనాలు రూపొందించాలన్నారు. రోడ్లు వేసేటప్పుడు రోడ్డుకు, డ్రైనేజీకి మధ్య ఖాళీ లేకుండా చూడాలన్నారు. డివైడర్లలో వేసిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, పార్కులలో పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సూపరింటెండింగ్ ఇంజినీరు మదర్షా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవో నారాయణ బదిలీ



కంబాలచెరువు: రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఈవీవీఎస్ఎస్ఎస్ బీఎల్ నారాయణ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ పాఠశాల విద్యాశాఖాధికారి (పూర్తి అదనపు బాధ్యతలు)గా ఆయన పనిచేయనున్నారు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి (ఎఫ్ఏసీ)గా కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి వ్యవహరిస్తున్నారు.

ఉద్యోగాలకు 48 మంది ఎంపిక



అభ్యర్థికి ఆఫర్ లెటర్ అందిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ: వికాస ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 48 మంది యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఎనిమిది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో వికాస మేనేజర్ బాబు, అసిస్టెంట్ మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు షీ టీమ్‌లను పోలీసులు పునఃప్రారంభించారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టెండర్లు సిద్ధం చేశామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తన పుట్టినరోజైన ఈనెల 26న సొంత ఖర్చుతో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు సరస్వతీ ఘాట్ నుంచి పుణ్యక్షేత్రాల దర్శనం బస్సు ప్రారంభిస్తున్నామన్నారు. కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, ద్రాక్షారామ మీదుగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి పర్యటన ఉంటుందన్నారు. ప్రతి శని ఆదివారాల్లో ఈ పర్యాటక పుణ్యక్షేత్రాల టూరు ఉంటుందన్నారు.

ఆదాయ వనరులను పెంచేందుకు కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రుడా పరిధిలో పీపీపీ విధానంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఆదాయ వనరులను పెంచేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్, రుడా చైర్ పర్సన్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రుడా బోర్డు 5వ సమావేశం నిర్వహించారు. రుగా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్, ఇతర శాఖల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుడా పరిధిలోని అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేయడం ద్వారా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవడం, రుడా పరిధిలో అనుమతుల జారీ కోసం వసూలు చేసే దరఖాస్తు రుసుమును రూ.500 నుంచి రూ.వెయ్యికి పెంచడాన్ని సభ్యులు ఆమోదించారు. బోర్డు నాలుగో సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. కేతన్ గార్గ్ మాట్లాడుతూ రుడా పరిధిలో డెవలప్‌మెంట్ వర్కులను ఆపరేషనల్ మెయింటెనెన్స్‌తో కూడిన ప్రతిపాదనలు చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ పురోగతి, ప్లానింగ్ లేఅవుట్, బిల్డింగ్ అప్లికేషన్ యూజర్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీల పెంపుదలపై సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో రుడా కమిటీ సభ్యులు రుడా సెక్రటరీ శైలజ, టూరిజం ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత, విద్యుత్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, జిల్లా రహదారుల భవనాల అధికారి ఎస్‌బీవీ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు, కొత్త లైన్ల ఏర్పాటు తదితర పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కంభంవారి సత్రం, వంకాయలవారి వీధి, మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, శివరామ కలర్ ల్యాబ్ ఏరియా, కోటిపల్లి బస్టాండ్, ఇసుక వీధి, నాళం భీమరాజు వీధి, రంగ్రీజు పేట, చందా సత్రం, గుండువారి వీధి, సదనం, పుష్కరఘాట్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల కోసం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాతేరు పంచాయతీ ఏరియా, దానరి నగర్, దేవాంగుల పేట, సీటీఆర్ఐ రోడ్డు, సీతానగరం రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ వెంకట నగరం, టిడ్కో గృహ సముదాయం, పెట్రోల్ బంక్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

కడియపులంక సబ్ స్టేషన్ పరిధిలో..

కడియం: కడియపులంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. వార్షిక మరమ్మతులు, కొత్త 11 కేవీ లైన్ పనుల కోసం కడియపులంక ఫీడర్‌కు సరఫరా ఉండదన్నారు. దీంతో కడియపులంక, బుర్రిలంక, దోసాలమ్మ కాలనీల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు అన్నసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం మహాన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు గురువారం తెలిపారు.

- 20వ డివిజన్‌లోని ఆల్కాట్‌తోట కన్నమాంబవీధి చదునుపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అన్నదానం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

వెబ్‌ల్యాండ్‌లో మా పేర్లు మారిపోయాయి



గ్రామసభలో అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని ఎస్‌వీ జనరల్ మార్కెట్ సమీపంలోని సర్వే నెంబరు 617/1లో గతంలో చేసిన సర్వేలో తమపేర్లు మారిపోయి వేరే పేర్లు వచ్చాయని ఎక్స్ తాడిటాపర్స్ ఫీల్డ్ లేబర్ మల్టీపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తెలిపారు. పిడింగొయ్యి గ్రామపంచాయతీలో డిప్యూటీ తహసీల్దార్ ఏ.రాజాబాబు అధ్యక్షతన గురువారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సభలో సొసైటీ సభ్యులు తమ భూములను రీసర్వే చేసి వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లు నమోదు చేయాలని కోరారు. అడంగళ్, రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి తమ పేర్ల మీదే ఉందని, కోర్టు తీర్పుసైతం తమకు అనుకూలంగా ఇచ్చిందన్నారు. కాగా.. గ్రామసభను జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. సర్వేయర్ భువనేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.